క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవ పూజలు



బంటుమిల్లి: పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గోపూజ సంప్రదాయ పద్ధతిలో జరిపారు. స్వామి వారి ప్రధానమూర్తులకు, సుదర్శనమూర్తికి పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం శ్రీలక్ష్మీ సుదర్శన హోమం, పూర్ణాహుతి పూర్తి చేశారు. పలువురు దంపతుల దీక్ష ధారణలతో స్వామివారి శాంతి కల్యాణాన్ని పండితులు పవన్, సాయి శిష్య బృందం వేద మంత్రాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరుపేద ఎస్టీలకు సాయం



చల్లపల్లి: నిరుపేదల అవసరాలు గుర్తించి సహాయం చేస్తున్నామని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్‌బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక కోమలానగర్, నారాయణ రావు నగర్ కాలనీల్లో గుడారాల్లో జీవిస్తున్న 70 మంది నిరుపేద ఎస్టీ కుటుంబాల వారికి రూ.లక్ష విలువగల నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ కోవిడ్ నాటి నుంచి నేటి వరకు ప్రతి నెలా ఈ కుటుంబాలకు సహాయం చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏటా వస్త్రదానం చేసి వారికి అండగా నిలుస్తున్నామన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు సహకరించండి

చిలకలపూడి(మచిలీపట్నం): మాదక ద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ బి. రామకుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో మాదకద్రవ్యాల నియంత్రణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రామకుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగించే ప్రాంతాలను గుర్తించామన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న అనుమానితులను పోలీసుల ద్వారా గుర్తించి వారికి ట్రీట్‌మెంట్ ఇప్పించడంతో పాటు మాదక ద్రవ్యాలు వినియోగిస్తే ఎటువంటి అనారోగ్యాలకు గురవుతారో కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో 15 ప్రాంతాలను గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల్లో డ్రగ్ ఎడిక్షన్ సెంటర్‌కు చెందిన సైకాలజిస్టులతో మాదక ద్రవ్యాలు వినియోగించకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సైకాలజిస్టులు జి. శంకరరావు, శ్రావణి కృష్ణకుమారి, జె. రత్నకుమారి, రవిభార్గవరావు, ఎల్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీలు

మచిలీపట్నంటౌన్: త్యాగరాజ సంగీత విద్యాపీఠం మచిలీపట్నం శాఖ స్వర్ణోత్సవ సంగీత సభలు ఆదివారం 5వ రోజుకు చేరాయి. స్వర్ణోత్సవ సంగీత కార్యక్రమం స్థానిక బుట్టాయిపేటలోని చిట్టి పిళ్లారయ్య స్వామి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించారు. ప్రముఖ గాత్ర కచేరీ కళాకారులు పి. గాయత్రిగౌరీనాథ్, ఎం. చారుమతి పల్లవిల గాత్రం ఆహూతులను అలరించింది. వయోలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై కుందుర్తి అరవింద్ వాయిద్య సహకారం అందించారు. పోపూరి గౌరీనాథ్ గాత్రం ఆహూతులను ఆనంద డోలికల్లో ఓలలాడించింది. వయోలిన్‌పై కృష్ణవేణి, మృదంగంపై ప్రసాద్ వాయిద్య సహకారం అందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ గౌరీనాథ్ విజయవాడ ఆకాశవాణిలో శాస్త్రీయ సంగీతంలో ఎ-గ్రేడ్ విద్వాంసునిగా గానం చేస్తుండటం అభినందనీయమన్నారు. సంస్కృతాంధ్రంలో పలు కృతి రచనలు చేశారని చెప్పారు. విజయవాడలో సద్గురు సంగీత సభను స్థాపించి 30 ఏళ్లుగా కళాకారులను, యువ కళాకారులను ఆయన ప్రోత్సహిస్తున్నారన్నారు. సంగీత విద్యను బోధిస్తూ ఎంతో మంది శిష్యులను తయారుచేస్తూ ఉత్తమ శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. సంగీత విద్యాపీఠం అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు సింగరాజు గోవర్ధన్, కార్యదర్శి కల్యాణి, నిర్వాహక కార్యదర్శి కాశీపట్నపు ఉమా పర్యవేక్షించారు.

కలుపు మొక్కల తొలగింపు



తోట్లవల్లూరు: జాతీయసేవా పథకంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల సేవా కార్యక్రమాలు మండలంలోని దేవరపల్లిలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఉషారాణి పర్యవేక్షణలో గ్రామంలోని పలు రహదారుల వెంట వయ్యారిభామ కలుపుమొక్కల తొలగింపు కార్యక్రమాలను ఆదివారం విద్యార్థులు నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వయ్యారిభామతో వచ్చే దుష్ప్రభావాలు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిగించారు. కళాశాల ఆచార్యులు డాక్టర్ అపర్ణ, డాక్టర్ సువర్ణలత పాల్గొన్నారు.

వరించింది

- అదును దాటి సాగుచేసినా ఆశాజనకంగా వరి
- తీరప్రాంతాల్లో ప్రారంభం కానున్న వరి కోతలు
- ఎకరానికి 35 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం
- కాలువలకు సాగునీరు ఇవ్వడం వల్లే పంట పండిందని రైతుల హర్షం

కోడూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరిపంట అదును దాటినా కూడా పుష్కలంగా పండింది. కోడూరు మండలంలోని సముద్ర తీర ప్రాంత రైతులు అనేక ఒడిదొడుకుల మధ్య ఈ ఏడాది వరిని సాగు చేశారు. మండలంలోని రామకృష్ణాపురం, ఊటగుండం, ఇరాలి, హంసలదీవి గ్రామాలకు చెందిన రైతులు గత ఏడాది జూన్ నెలలో సుమారు రెండు వేల ఎకరాల్లో ఖరీఫ్ పంటగా వరి సాగు చేశారు. సముద్ర పోటు కారణంగా మురుగు డ్రెయిన్ల పొంగి ప్రవహించడంతో పాటు సముద్రం నీరు కూడా వచ్చి పొలాల్లో చేరింది. ఇదే సమయంలో భారీ వర్షాలు కూడా కురవడంతో ముంపు సమస్య మరింత ఎక్కువైంది. దీంతో రైతులు సాగు చేసిన వరి నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒక్కో రైతు సుమారు రెండు, మూడు సార్లు వరి నారుమళ్లను వేశారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ నెలాఖరు వరకు కూడా తీరప్రాంతాల్లో అనేకమంది రైతులు వరినాట్లు పూర్తి చేయని పరిస్థితి.



రామకృష్ణాపురంలో ఏపుగా పెరిగిన వరిపంట

ఎమ్మెల్యే చొరవతో కాలువలకు సాగునీరు..

సెప్టెంబర్ నెలాఖరు వచ్చినా కూడా నారుమళ్లు పూర్తిగా సిద్ధం కాకపోవడంతో తీరప్రాంత రైతులు పంటపై ఆశలు వదులుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి మార్చి నెలాఖరు వరకు కాలువ వెంట సాగునీరు ఇస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వరి పంటను రైతులందరూ సాగు చేసుకోవాలని, ఏవిధమైన ఇబ్బందులు వచ్చినా కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే హామీతో రైతులు మళ్లీ సెప్టెంబర్ నెలాఖరులో వరినారుమళ్లు పోసుకున్నారు.

35 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా

పంటను ఆలస్యంగా సాగు చేసినప్పటికీ కాలువలకు సాగునీరు పుష్కలంగా అందించడంతో వరి పంట బాగా పండిందని తీరప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. వారంలో వరి కోతలు ప్రారంభం అవుతాయని, ప్రస్తుతం ప్రభుత్వ చర్యలతో ధాన్యం ధర కూడా బాగానే ఉందని రైతులు అంటున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని కూడా అధికారులు కొనేలా చర్యలు తీసుకోవాలని తీర ప్రాంత రైతులు కోరుతున్నారు.

పంట బాగా పండింది



అధిక వర్షాలు, మురుగు సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొని సాగుచేసిన వరిపంట అదును దాటినా కూడా పుష్కలంగా పండింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో చివరి భూములకు కూడా కాలువల వెంట సాగు నీరు ఇచ్చారు. ప్రస్తుతం నేను సాగు చేసిన ఐదు ఎకరాల వరి పంట ఆశాజనకంగా ఉండడంతో పాటు ఎకరానికి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ధాన్యానికి కూడా మంచి ధర ఉండటం వల్ల రైతులందరం చాలా ఆనందంగా ఉన్నాం.

–చేబోయిన కృష్ణారావు, రైతు, ఊటగుండం

సాగునీరు ఇవ్వడం వల్లే..



రెండు, మూడు సార్లు వరి నారుమళ్లు దెబ్బతిన్నా కూడా పట్టువదలకుండా తొమ్మిది ఎకరాల్లో పంటను వేశాను. ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులు మాకు సహకరించి నిత్యం మా సమస్యలను పరిష్కరించారు. మురుగు సమస్యకు పరిష్కారం చూపుతూనే నీటిని అందించారు. మరో 15 రోజుల్లో వరి కోతలు కూడా ప్రారంభిస్తాం.

–దేవనబోయిన ప్రసాద్, ఊటగుండం, రైతు

‘ఆసరా’తో అక్కచెల్లెమ్మలకు భరోసా

పేర్ని కిట్టు



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మహిళలకు ఆసరా లభిస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పలు డివిజన్లలోని డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యులకు మూడో విడత నిధుల జమ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. తొలుత రాజుపేట షాదీఖానాలో 35, 36, 37 డివిజన్లు, అనంతరం గడ్డిబజారులోని కాపు కల్యాణ మండపంలో 32, 33, 34 డివిజన్లు, ఈడేపల్లి పద్మావతి బీఈడీ కళాశాలలో 45, 46, 47 డివిజన్లలోని పొదుపు సంఘాల డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం చెక్కును పేర్ని కిట్టు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని డ్వాక్రా మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు డ్వాక్రా అక్కచెల్లెమ్మలను మాయమాటలతో మోసంచేశారని చెప్పారు. సీఎం జగనన్న ఇచ్చిన మాట ప్రకారం మూడో విడత ఆసరా మొత్తాన్ని జమ చేసి ఆదుకుంటున్నారన్నారు. డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేసే దిశగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మేలు జరుగుతోందని భావిస్తేనే జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ తొమ్మిది డివిజన్లకు సంబంధించి 396 సంఘాలకు గానూ 3,042 మంది మహిళలకు రూ. 3.75 కోట్ల ఆసరా మొత్తాలను అందజేశారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ తంటిపూడి కవిత థామస్‌నోబుల్, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, మెప్మా సీఎంఎం బసవేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బందెల థామస్ నోబుల్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు మీర్ అస్గర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

నేడు బంటుమిల్లి మండలంలో..

బంటుమిల్లి: మండల పరిధిలోని పెదతుమ్మిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ వి. చినబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం. రాజబాబు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. పెదతుమ్మిడి, పి. రావిగుంట, మల్లపరాజుగూడెం, ఆముదాలపల్లి, రామవరపుమోడి, చినతుమ్మిడి గ్రామాల పరిధిలోని డ్వాక్రా సభ్యులకు నిధులు విడుదల అవుతాయని చెప్పారు. మండల పరిధిలో పెదతుమ్మిడి, చోరంపూడి, బంటుమిల్లి, అర్తమూరు గ్రామాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని వారు చెప్పారు.

నేడు చినగొల్లపాలెంలో..

కృత్తివెన్ను: వైఎస్సార్ ఆసరా పథకం చెక్కు పంపిణీ కార్యక్రమం సోమవారం చినగొల్లపాలెం గ్రామంలో జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వై. వెంకటరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేసవిలో విద్యుత్ కష్టాల నియంత్రణకు చర్యలు

మచిలీపట్నంటౌన్: రానున్న వేసవిలో నగర ప్రజలు విద్యుత్ కష్టాలు ఎదుర్కోకుండా ఉండేందుకు ఆ శాఖాధికారులు చర్యలకు ఉపక్రమించారు. మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు పర్యవేక్షణలో వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా లోఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు స్థానిక 132 కేవీ సబ్ స్టేషన్‌లో 50 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రానున్న పదిరోజుల్లో ఈ ట్రాన్స్‌ఫార్మర్ చార్జింగ్ పూర్తి చేయనున్నారు. ఇప్పటి వరకు రెండు 50 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ శాఖ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. నగర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు గాను అధికారుల ప్రతిపాదనలకు అనుగుణంగా చర్యలు తీసుకున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పద్మజనార్దనరెడ్డికి, ఉన్నతాధికారులకు ఈఈ భాస్కరరావు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతూ వినియోగదారులకు సేవలు అందించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని భాస్కరరావు తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు ఉన్నతాధికారులతో చర్చించిన ఎమ్మెల్యే పేర్ని నానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.



50 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

పెడన మున్సిపల్ కమిషనర్ అంజయ్య

పెడన: పట్టణాన్ని ఓడీఎఫ్ ప్లస్‌గా తీర్చిదిద్దడానికి కఠిన చర్యలు అమలు చేయనున్నామని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 పోటీల్లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ఈ చర్యలు చేపట్టామన్నారు. పట్టణాన్ని పూర్తి స్థాయిలో బహిరంగ మల మూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు కొన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను నివాసాల వద్దనే విభజన చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. అలాగే అధికంగా చెత్త ఉత్పత్తి అయ్యే ప్రాంతాల్లో కూరగాయల మార్కెట్, రైతుబజారు, అపార్ట్‌మెంట్లు, భోజనం హోటళ్ల వద్ద ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు, బాటిల్స్ వంటివాటిని పూర్తిగా నిషేధించామన్నారు. వీటిని ఎవరైనా విక్రయిస్తే అపరాధ రుసుం వసూలు చేస్తామని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే పదిహేను రోజుల్లోగా మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కమిషనర్ పేర్కొన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యతతో ముందుకు సాగాలి

మచిలీపట్నంటౌన్: ఆర్యవైశ్యులు ఐక్యతతో ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు జీవీ గున్నయ్యశెట్టి అన్నారు. కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గ సభ్యుల పరిచయ, పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి సత్రంలో జరిగింది. ముఖ్య అతిథి గున్నయ్యశెట్టి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్యతతో ముందుకు సాగుతూ సామాజిక సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలన్నారు. ఆర్యవైశ్యుల్లోని పేదలను ఆదుకునేందుకు కృషి చేయాలని చెప్పారు. దీనికి ఆర్యవైశ్య సంఘంతో పాటు అనుబంధ సంఘాలు సహకరించాలన్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా రతికంటి రామచంద్రరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సన్నిధి నాగసాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వెంట్రప్రగడ వీరాంజనేయులు, కోశాధికారిగా మానేపల్లి రఘురాంబాబు, చీఫ్ ఆర్గనైజర్‌గా యెందూరి పిచ్చేశ్వరరావు, పీఆర్వోగా దొరడ్ల కోటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాడికొండ శివనాగరాజు, ప్రోగ్రాం కన్వీనర్లుగా వేముల శ్రీనివాస్, వేముల కృష్ణ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా వెచ్చా మల్లికార్జున గుప్తా, పద్మనాభుని శేఖర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వధూవర పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు యేల్చూరి వేణుగోపాలరావు, ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు చక్కా చెన్నకేశవరావు, బొగ్గవరపు తిరుపతయ్య, తుమ్మేపల్లి నరేంద్రరావు, చీకటిమర్ల శివరామప్రసాద్, కొలిపాకుల వెంకటేశ్వరరావు, కంచర్ల ముత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పరిచయ వేదిక నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

నేడు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

పెడన: నందమూరులో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి వారి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ఉదయం నిర్వహిస్తామని ఆలయ నిర్మాణ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9.38 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. కట్టా పోతురాజుస్వామి, వెంకటేశ్వరమ్మ దంపతులచే ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఉంటుందని, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

కార్తికేయుని ఆలయం కళకళ



మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కిస్తామని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే కానుకల లెక్కింపులో పాల్గొనే భక్తులు డ్రెస్ కోడ్‌లో హాజరు కావాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రహదారిని ప్రారంభిస్తున్న వెంకటరమణారావు, రమేష్‌బాబు

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- ఎమ్మెల్యే సింహాద్రితో కలిసి సీసీ రోడ్డు ప్రారంభం

కోడూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. కోడూరు పంచాయతీ పరిధిలోని ఆరో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా కేటాయించిన రూ.5 లక్షల నిధులతో నిర్మించిన నూతన సీసీ రహదారిని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలిసి వెంకట రమణారావు ఆదివారం ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడే పథకాలను అమలు చేసి కుటుంబాలు ఆర్థికంగా పరిపుష్టి సాధించేందుకు తోడ్పాటునిస్తోందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం లాంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయా పంచాయతీల పరిధిలో ప్రజలు చెప్పిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కూడా నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు ఉండాలనే సంకల్పంతో జగనన్న కాలనీలకు శ్రీకారం చుట్టడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు కూడా లబ్ధిదారుడి ఖాతాకు నగదును జమ చేస్తున్నామని చెప్పారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో జరిగిన మార్పులను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజల చూపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉందని వెంకట రమణారావు స్పష్టం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం నివాస గృహం వద్ద జరిగిన కార్యక్రమంలో వెంకటరమణారావు , రమేష్‌బాబు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల నేతలు, ప్రజాప్రతినిధులు మోపిదేవిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. యువ నేత సింహాద్రి వికాస్, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, వివిధ గ్రామాల నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన చంద్రబాబు

- ఎమ్మెల్యేలను కొనడంలో చంద్రబాబు దిట్ట
- ఎంపీ మోపిదేవి వెంకట రమణావు ఆగ్రహం
- ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే



ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్న ఎంపీ వెంకట రమణావు, ఎమ్మెల్యే రమేష్‌బాబు

అవనిగడ్డ: ఎమ్మెల్యేలను కొని మామ నుంచి అధికారం లాక్కున్న చంద్రబాబు రాజకీయ వ్యవస్థను ఏనాడో భ్రష్టు పట్టించాడని, ఎమ్మెల్యేలను కొనడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా అవనిగడ్డ మండలంలో ఐదుగురు రైతులకు, నాగాయలంక మండలంలో ముగ్గురు రైతులకు రాయితీపై ట్రాక్టర్లను ఎంపీ వెంకట రమణారావు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకట రమణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైతిక విలువలతో రాజకీయాలు చేస్తుంటే, చంద్రబాబు అనైతిక విధానాలతో రాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. రాజకీయ వ్యవస్థను వ్యాపారంగా మార్చిన వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. టీడీపీ నాయకులు వాపును చూసి బలుపు అనుకుంటూ భ్రమల్లో ఉన్నారని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ చంద్రబాబు తమ ఎమ్మెల్యేలను కొన్నారని, టీడీపీది అసలు గెలుపే కాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు సింహాద్రి వికాస్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి, జెడ్పీటీసీలు చింతలపూడి లక్ష్మీనారాయణ, మోకా బుచ్చిబాబు, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఏఓ శౌరమ్మ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రూ.85 లక్షల వార్షిక ఆదాయం లక్ష్యం



సీఈఓ కృష్ణారావును సత్కరిస్తున్న చైర్మన్ ఫణి

చల్లపల్లి: ఏడాదికి రూ.85 లక్షల ఆదాయం సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు పాగోలు నాగ సీతారామారావు (ఫణి) అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పీఏసీఎస్‌లో సంఘ మహాజన సభ నిర్వహించారు. ఫణి మాట్లాడుతూ తమపై విశ్వాసంతో త్రిసభ్య కమిటీ నియమించి బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సూచనల మేరకు సంఘాన్ని అభివృద్ధి బాటలో పయనింప జేస్తున్నామని చెప్పారు. త్రిసభ్య కమిటీ సారథ్యంలో 2019లో రూ.30 లక్షలు, 2020లో రూ.34 లక్షలు, 2021లో రూ.48 లక్షలు, 2022లో రూ.52 లక్షలు సాధించామన్నారు. 2022–23 సంవత్సరంలో రూ.85 లక్షలు లాభాలు సాధించే అవకాశం ఉందన్నారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు చొరవతో కేడీసీసీ బ్యాంక్, పీఏసీఎస్ కలిసి రైతులకు జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. లాభాల నుంచి త్వరలో రైతులకు డివిడెంట్లు పంపిణీ చేస్తామన్నారు. పీఏసీఎస్‌ను మరింత అభివృద్ధి చేసి స్ట్రాంగ్ రూమ్, లాకర్లు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. గోడౌన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. సంఘ అభివృద్ధికి విస్తృత కృషి చేస్తున్న సొసైటీ సీఈఓ తోట కృష్ణారావును సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, సంఘ మాజీ అధ్యక్షుడు మద్దిపట్ల జగన్మోహనరావు, పర్సన్లు వేముల ఏడుకొండలు, కొలుసు సుబ్బారావు, రవి, రైతులు పాల్గొన్నారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి



కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకుల సందడితో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై పేర్లు రాసుకుంటూ మురిసిపోగా, యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్ ఆటలతో సేదతీరారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరంలో గస్తీ చేపట్టారు. కరకట్ట వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేశారు. తీరంలో పర్యాటకులకు సూచనలిస్తూ అప్రమత్తం చేశారు.